సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 30 । మార్చి । 2025



ఈవీఎం గోడౌన్ తనిఖీ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్లలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను కలెక్టర్ సీహెచ్ నాగరాణి శనివారం తనిఖీ చేశారు.



మండుతున్న ఎండలు

ఎండలు మండిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా దాదాపు 40 డిగ్రీల చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)
భీమవరం	6.22
నరసాపురం	6.23
తాడేపల్లిగూడెం	6.17

న్యూస్‌రీల్

విద్యుత్ మీటర్ రీడర్ల సమ్మె నోటీసు



ఈఈకి నోటీసు అందిస్తున్న రీడర్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ విద్యుత్ మీటర్ బిల్లింగ్ రీడర్లు ఏప్రిల్ 1 నుంచి సమ్మె బాట పట్టనున్నారు. రీడర్ల యూనియన్ నాయకులు జాకబ్, వెంకటరత్నం, జేమ్స్, కొరు శ్రీనివాస్, ఆనంద్ ప్రసాద్ శనివారం తాడేపల్లిగూడెం డివిజన్ కార్యాలయంలో ఈఈ కె.నరసింహమూర్తికి సమ్మె నోటీసు అందజేశారు. డివిజన్ పరిధిలో 250 మంది రీడర్లు సమ్మెలోకి వెళుతున్నట్టు చెప్పారు. విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత, నెలవారీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపుతో తమ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాని కారణంగానే సమ్మెకు దిగుతున్నట్టు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి పోలిశెట్టి జానకి రామారావు, ఉండి నియోజకవర్గానికి ఉప్పాడ చిన్న రామారావు, నరసాపురం నియోజకవర్గానికి తిర్రె బాబురావు, ఆచంట నియోజకవర్గానికి మైలే ఏసురత్నం నియమితులయ్యారు.

'పది' పరీక్షకు 118 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లాలో శనివారం నిర్వహించిన ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2, ఒకేషనల్ థియరీ పరీక్షకు 118 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. 3,274 మంది విద్యార్థులకు 3,156 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

వేమూరికి ఉగాది పురస్కారం



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన కవి వేమూరి శ్రీనివాస్ జిల్లాస్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. భీమవరం బీవీరాజు ఆడిటోరియంలో ఆదివారం జరిగే ఉగాది ఉత్సవాల్లో కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకోనున్నారు.

బీసీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎంపిక



కార్యవర్గ సభ్యులు

భీమవరం: వెనుకబడిన కులాల ఉద్యోగుల సంక్షేమం కోసం రాష్ట్ర సంఘానికి అనుబంధంగా జిల్లాస్థాయి తాత్కాలిక కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశామని రాష్ట్ర ఓబీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం తెలిపారు. జిల్లా గౌరవ సలహాదారుగా కుక్కల కృష్ణారావు, అధ్యక్ష, కార్యదర్శులుగా బొక్కా వినాయకుడు, వారధి వెంకట రమణరావు, వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా గూడవల్లి వీరవెంకట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చించినాడ మధు ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా దెందులూరి వీర వెంకటహనుమంతరావు, చందనాటి వెంకటాచలం, దేనబోయిన శ్రీధర్ ఎంపికయ్యారు.

స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీలు



భీమవరం: జిల్లాలోని పలువురు ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లను స్పెషల్ బ్రాంచ్‌కి నియమిస్తూ ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఉత్తర్వులు విడుదల చేశారు. ఎం.బాబురావు (భీమవరం టౌన్), జి.సత్యం (కాళ్ల), కె.ధర్మారావు, ఏఎస్సై (భీమవరం టూటౌన్), ఆర్.వెంకటేశ్వరరావు (నరసాపురం రూరల్), పి.శ్రీనివాసరావు ఏఎస్సై (పాలకొల్లు రూరల్), ఏఎస్ఆర్ ప్రసాద్ (పోడూరు), డీవీ వెంకటేశ్వరరావు (తణుకు ట్రాఫిక్), పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం (తాడేపల్లిగూడెం టౌన్)ను స్పెషల్ బ్రాంచ్‌కు నియమించారు. అలాగే స్పెషల్ బ్రాంచ్ నుంచి వీవీ భూషణం, ఎస్.పేరినాయుడును వీఆర్‌కు పంపారు.

ఖాకీల పచ్చపాతం

కూటమి సేవలో పోలీస్

- ఉమ్మడి పశ్చిమలో టీడీపీ బరితెగింపు రాజకీయాలు
- అత్తిలిలో తీవ్ర ఘర్షణలు జరిగినా పట్టించుకోని పోలీసులు
- కైకలూరులో దాడులు జరిగినా స్పందన నిల్
- రివర్స్ కేసుల పేరుతో యలమంచిలిలో హడావుడి
- స్థానిక పోరులో పోలీసుల అత్యుత్సాహం
- డీజీపీ నుంచి ఎస్పీ వరకూ స్పందించని వైనం



అత్తిలిలో వైఎస్సార్‌సీపీ నేత వద్దూరి సీతారాంను నెట్టివేస్తున్న తణుకు రూరల్ సీఐ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక ఎన్నికల పోరులో పోలీసులు పచ్చ పార్టీ నేతలకు పూర్తిగా దాసోహం అనే రీతిలో వ్యవహరించారు. అత్తిలిలో రెండు రోజులపాటు వందలాది మంది టీడీపీ కేడర్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసాన్ని చుట్టుముట్టినా పోలీసులు స్పందించని పరిస్థితి. కైకలూరులో తీవ్ర ఘర్షణలు, ఒక రిపోర్టర్‌పై తీవ్రస్థాయిలో దాడి జరిగినా పట్టించుకోలేదు. యలమంచిలిలో మాత్రం మంత్రి మాటలకు తలొగ్గి ఓ మహిళా ఎంపీటీసీ సభ్యురాలిని అరెస్ట్ చేయడానికి తీవ్ర అత్యుత్సాహం చూపించారు. డీజీపీ మొదలు రెండు జిల్లాల ఎస్పీల వరకూ ఎవరికి ఫిర్యాదు చేయడానికి ఫోన్ చేసినా స్పందించని దుస్థితి. ఇది స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖాకీలను అడ్డం పెట్టుకుని కూటమి పార్టీలు చేసిన అరాచకం.

అత్తిలిలో చేష్టలుడిగి చూస్తూ..

తణుకు నియోజకవర్గంలోని అత్తిలి మండలం ఎంపీపీ ఎన్నిక షెడ్యూల్ మేరకు గురువారం జరగాల్సి ఉంది. 18 మంది ఎంపీటీసీ సభ్యులు మాజీ మంత్రి కారుమూరి నివాసానికి చేరుకుని ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లడానికి సన్నద్ధమవుతున్న తరుణంలో వందలాది మంది టీడీపీ శ్రేణులు మాజీ మంత్రి ఇల్లు చుట్టుముట్టారు. దమ్ము ఉంటే మమ్మల్ని దాటి వెళ్లండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ... వాహనాలను రోడ్లకు అడ్డంగా పెట్టి మోహరించారు. కొన్ని గంటల పాటు హైడ్రామా నడిపారు. తణుకు రూరల్ సీఐ కృష్ణకుమార్, అత్తిలి ఎస్సై ప్రేమ్‌కుమార్, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీతో సహా డీజీపీ వరకూ అందరికీ మాజీ మంత్రి ఫోన్ చేసినా ఒక్కరూ స్పందించలేదు. వందలాది మంది చుట్టుముట్టి దాడికి సిద్ధంగా ఉండగా అత్తిలిలో ఉన్న స్పెషల్ పార్టీ పోలీసులు చూస్తూ ఉండిపోయారు. ఒక దశలో కూటమి శ్రేణులు కారుమూరి నివాసం గేట్లను నెట్టుకుని రావడానికి యత్నిస్తే కారుమూరి, వైఎస్సార్‌సీపీ కేడర్ అడ్డుకున్నారు. శుక్రవారం టీడీపీ మరో అడుగు ముందుకేసి ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే మహిళలను వాహనాల్లో తరలించారు. ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడిన క్రమంలో ఆ రోజూ వందలాది మందిని టీడీపీ మోహరించి ఎంపీటీసీలను బయటకు రానివ్వకుండా చేసింది. అలాగే గ్రామంలోకి వచ్చే వాహనాలన్నింటినీ తనిఖీలు చేస్తూ పోలీసులు హడావుడి చేశారు. కనీసం దాడి జరిగే అవకాశం ఉన్న ప్రాంతంలో పరిస్థితిని చక్కదిద్దడం, ఎంపీటీసీలకు రక్షణ కల్పించి ఎన్నికకు తీసుకువెళ్లే ప్రయత్నంగాని చేయలేదు. ఈ క్రమంలో మాజీ మంత్రి కారుమూరి విలేకరుల సమావేశం నిర్వహించి ఎస్పీ మొదలు డీజీపీ, డీజీపీ పీఏ వరకూ అందరికీ ఫోన్ చేసినా ఒక్కరూ స్పందించలేదు.

యలమంచిలిలో అత్యుత్సాహం

యలమంచిలిలో పోలీసులు అత్యుత్సాహం చూపించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ (గుంపర్రు)ని ప్రలోభాలకు గురిచేసినా లొంగలేదు. దీంతో ఆమె కుమార్తె, బాలిక షర్మిలతో సత్యశ్రీ కిడ్నాప్‌నకు గురైందని ఫిర్యాదు తీసుకుని ఎన్నిక కోసం కార్యాలయానికి వచ్చిన ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లడానికి పాలకొల్లు రూరల్, టౌన్ సీఐలు గుత్తల శ్రీనివాస్, కోలా రవికుమార్, యలమంచిలి ఎస్సై బుర్రయ్యలు హడావుడి చేశారు. స్టేషన్‌కు రావాలని గట్టిగా పట్టుబడితే ఎన్నిక అయ్యాక వస్తానని ఆమె చెప్పినా సీఐ వినకుండా మహిళా కానిస్టేబుల్ సాయంతో జీపు ఎక్కించాలని ఆదేశించారు. చివరకు సత్యశ్రీ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ గట్టిగా పోలీసులతో వాదనలకు దిగడంతో వారు వెళ్లిపోయిన పరిస్థితి. ఇలా స్థానిక సంస్థల ఎన్నికల్లో అడుగడుగునా పోలీసులు కూటమి సేవలో తరలించారు.



యలమంచిలిలో ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీని బలవంతంగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు (ఫైల్)

కైకలూరులో దాడులు జరిగినా..

కైకలూరులోనూ ఇదే తరహాలో పోలీసులు వ్యవహరించారు. కైకలూరు వైస్ ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో కూటమి నేతలు సుమారు 30 మంది జర్నలిస్టులపై పోలీసుల సమక్షంలో దాడి చేసినా కనీసం స్పందించలేదు. భుజబలపట్నం ఎంపీటీసీ సభ్యుడు సూర్యనారాయణను గురు, శుక్రవారాలు రెండు రోజులు పాటు ఇంటి వద్దనే ఎన్నికకు రానివ్వకుండా చేసిన దానిపై మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఎస్సై మొదలు ఎస్పీ వరకూ ఫోన్ చేసినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. రెండు రోజులపాటు ఇదే తరహాలో అధికార పార్టీ హడావుడి చేసి బలం లేకపోయినా దొడ్డిదారిన వైస్ ఎంపీపీ పదవిని దక్కించుకుంది.

లేసు ఉత్పత్తుల్లో నాణ్యత ప్రధానం

కలెక్టర్ నాగరాణి



లేసు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్

నరసాపురం రూరల్: నాణ్యమైన లేసు ఉత్పత్తులతో మెరుగైన మార్కెటింగ్ లభిస్తుందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శనివారం మండలంలోని రుస్తుంబాదలో అలంకృతి లేసు పార్కును ఆమె సందర్శించారు. ముంబైకి చెందిన ఎగ్జిమ్ బ్యాంకు సౌజన్యంతో లేసు అల్లికల్లో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. అలాగే కొత్తగా మరికొందరు మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం ఉపయోగించే వస్తువులను లేసు ఉత్పత్తులతో తయారు చేస్తే మార్కెటింగ్ బాగుంటుందన్నారు. ఎగ్జిమ్ బ్యాంక్ ఈ ప్రాంతంలో శిక్షణ, మార్కెటింగ్‌కు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని లేసు ఉత్పత్తులు తయారు చేయాలన్నారు. లేసు అల్లికలకు దారల రంగులో నైపుణ్యం చూపాలన్నారు. మార్కెటింగ్ బాగుంటే ఆదాయం మెరుగవుతుందన్నారు. ఇప్పటికే నరసాపురం లేసుకు దేశవ్యాప్త గుర్తింపు జీఐ సర్టిఫికెట్ వచ్చిందన్నారు. ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ రాజరాజేశ్వరి, డీఆర్ డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, లవ్లీ హ్యాండ్స్ డీపీఎం, లేసు పార్క్ మేనేజర్ ఎస్.కుసుమకుమారి, ఎగ్జిమ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ ధర్మేంద్ర సచాన్, చీఫ్ మేనేజర్ కౌశలాల్ గిరి, ఏటీడీసీ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి, సర్పంచ్ ఎం.భారతి, ఏపీఎం జక్కంపూడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల ఆగడాలు తాళలేం

ఉంగుటూరు: గ్రామాల్లో కూటమి నాయకుల జోక్యం మితిమీరి ఉండటాన్ని నిలువరింపజేయాలని మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు క్యాంపు కార్యాలయం, ఉంగుటూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఎంపీడీఓ రాజ్ మనోజ్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇటీవల ఎ.గోకవరం కార్యదర్శి కుసుమపై ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నేతలు మితిమీరి వ్యవహరించిన ఘటనతో గ్రామ సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించలేని దుస్థితి నెలకొందని వాపోయారు. అలాగే మరో నాలుగైదు గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తాము మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు సంఘం అధ్యక్షుడు విజయకుమార్, ఉపాధ్యక్షుడు ధనలక్ష్మి, కార్యదర్శి దుర్గాప్రసాద్, సభ్యులు రమేష్, ట్రెజరర్ రవికుమార్ ఆధ్వర్యంలో కార్యదర్శులు వినతిపత్రాలు అందజేశారు.



ఉంగుటూరు ఎంపీడీఓ రాజ్‌మనోజ్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామ కార్యదర్శులు

భీమవరంలో ఇండస్ట్రీ మీట్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని కంపెనీల్లో సిబ్బంది కొరతను తీర్చేలా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. శనివారం స్థానిక హోటల్ ఆనంద ఇన్‌లో జిల్లాలో పలు కంపెనీల ప్రతినిధులతో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండస్ట్రీ మీట్'కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లను కలెక్టర్ అందజేశారు. పలు సంస్థల హెచ్‌ఆర్ ప్రతినిధులు మాట్లాడుతూ యువత ఆంగ్ల భాషలో పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు లేక ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ఉగాది కాంతులు



ఉగాది వేడుకలకు చిన వెంకన్న క్షేత్రం ముస్తాబైంది. ప్రధాన ఆలయంతో పాటు ఉగాది మండపం, పరిసరాలు విద్యుద్దీప కాంతులీనుతున్నాయి. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి శేష వాహనంపై ఊరేగించి ఉగాది మండపం వద్దకు తీసుకెళ్తారు. ప్రత్యేక పూజలు అనంతరం పండిత సత్కారం చేస్తామని ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. - ద్వారకాతిరుమల

ప్రత్తిపాడులో పారిశుధ్య పనులు

సాక్షి స్పందన

పెంటపాడు: 'ప్రమాదం అంచున ప్రజారోగ్యం' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి ప్రత్తిపాడు పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామ కార్యదర్శి పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో వీధులను శుభ్రం చేసి, రోడ్లపై చెత్తను తొలగించారు. ప్రత్తిపాడు శివారు కాగులంపాడు ఎన్టీఆర్ విగ్రహం వద్ద డ్రెయిన్‌లో సిల్టు తొలగించారు. గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



డ్రెయిన్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

రేపటి పీజీఆర్ఎస్ రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం రంజాన్ పండగ సందర్భంగా రద్దు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిలో కార్యక్రమాలను కూడా రద్దు చేస్తున్నామన్నారు.

మా బడిని మూయొద్దు



నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గొందిమూల గ్రామ మహిళలు

నరసాపురం: మా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేకుండా చేస్తారా.. అలా చేస్తే మేం ఊరుకోం.. అంటూ మండలంలోని వేములదీవి వెస్ట్ పంచాయతీ గొందిమూల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలలను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేసేలా విద్యాశాఖ ప్రయత్నించడంపై మండిపడ్డారు. ఈ క్రమంలో గొందిమూలలోని ప్రాథమిక పాఠశాలను కాపులకొడప హైస్కూల్‌లో విలీనం చేస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. మా స్కూల్ మాకు కావాలి అంటూ ప్లకార్డులతో మహిళలు, గ్రామస్తులు నినాదాలు చేస్తూ ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం డీఈఓ పట్టణంలోని మిషన్ హైస్కూల్ వద్దకు రాగా అక్కడకూ వెళ్లి ఆందోళన చేశారు. గ్రామస్తుల అంగీకారం లేకుండా పాఠశాలను విలీనం చేయమని డీఈఓ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వీరి ఆందోళనకు సీపీఎం మద్దతు తెలిపింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ కూటమి సర్కారు అనాలోచిన నిర్ణయాలతో గ్రామాల్లో ప్రభుత్వ బడులు లేకుండా చేయాలని చూస్తోందని విమర్శించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం తీరు మారకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్



అనివేటి మండపంలో నామమాత్రంగా ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంపై శనివారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. స్వామివారిని స్వల్ప సంఖ్యలో భక్తులు దర్శించారు. చినవెంకన్నకు ప్రీతికరమైనరోజు కావడంతో ప్రతి శనివారం వేలాదిగా భక్తులు క్షేత్రానికి విచ్చేస్తారు. ఈ వారం అమావాస్య కావడంతో నామమాత్రంగా భక్తులు శ్రీవారిని దర్శించారు. మధ్యాహ్నం నుంచి అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం విక్రయాల కౌంటర్లు ఇలా దాదాపు అన్ని విభాగాలు ఖాళీగా మారాయి.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

ముసునూరు: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు ముసునూరు బాలికల గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ తెలిపారు.శ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మార్చి నెల 31తో ముగియనుండగా, తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ఏప్రిల్ నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. ముసునూరు(బాలికలు), నాగిరెడ్డిగూడెం(బాలికలు), అప్పలరాజుగూడెం (బాలురు) గురుకులాల్లో 5వ తరగతిలో 80 చొప్పున 240 సీట్లు, 6, 7, 8 తరగతుల్లో ఖాళీలను బట్టి ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

మట్టిని తరలిస్తున్న లారీల సీజ్



మట్టి తరలిస్తున్న లారీలను సీజ్ చేసిన ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని బరువానిపేట నుంచి భీమవరం వైపు అక్రమంగా మట్టిని తరలిస్తున్న 3 లారీలను గొల్లవానితిప్ప వద్ద ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తోలకాలు జరిగితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండుతున్న ఎండలు

- 40 డిగ్రీలకు చేరువలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ఎండలో ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

భీమవరం(ప్రకాశం చౌక్) : మార్చి నెలలోనే జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటలకే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పట్టణాల్లోని ప్రధాన కేంద్రాల్లో ఎండ దెబ్బకు ఉదయం 11 గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తప్పక ఎండలో పనిచేసేవారు, ప్రయాణించేవారు ఎండకు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తలకు టవల్, టోపీ పెట్టుకుని ఎండ నుంచి రక్షణ పొందుతున్నారు. ఎండ తీవ్రత పెరగడంతో శీతల పానీయాల అమ్మకాలు పెరిగాయి.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో బీపీ, సుగర్, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఎండలో ప్రయాణించడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అనారోగ్య సమస్యలతో ఉన్న వారిని ఎండలో బయటకు తీసుకువెళ్లడం మంచిది కాదని.. వృద్ధులు, పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. ఎండలో ప్రయాణించడం వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదముంది. కళ్లు తిరగడం, నీరసం , విపరీతంగా చెమటలు పట్టడం. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. వడదెబ్బ తగలిన వ్యక్తిని నీడ ప్రదేశం లేదా గాలి తగిలే గదిలో ఉంచాలి. చల్లని నీళ్ల తాగించాలి. నీటితో ముఖం కడగాలి. వెంటనే దగ్గరలోని వైద్యుడికి చూపించాలి. తప్పనిసరిగా ఎండలో ప్రయాణించాల్సి వస్తే వడదెబ్బ తగలకుండా తలకు టవల్ లేదా టోపీ పెట్టుకోవాలి. మంచినీళ్లు, మజ్జిగ వెంట తీసుకువెళ్లాలి. మాంసాహారం తినరాదు.



ఎండ దెబ్బకు భీమవరంలో నిర్మానుష్యంగా రోడ్లు

పీహెచ్‌సీల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించాం



ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో వడదెబ్బ తగిలితే వెంటనే చికిత్స అందించడానికి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, విలేజ్ క్లినిక్‌లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో రెండు బెడ్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నాం. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లోని ఆశా వర్కర్ల వద్ద అందుబాటులో ఉంచుతున్నాం.

దాక్టర్ జి.గీతాబాయి,
జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి

ఉగాది ఉత్సవాలకు మన్యం సిద్ధం

- నేడు వన, గ్రామ దేవతలకు ఘనంగా పూజలు
- మామిడి కాయ పండుగకు ఏర్పాట్లు పూర్తి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఉగాది పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఉగాది రోజున వన దేవతలు, కొండ దేవతలకు పూజలు చేస్తారు. ఇంటి పేర్లతో పూజలు చేయడమే కాకుండా జంతు బలులు ఇస్తారు. వియ్యంకుడు వరుసయ్యే వారికి బలిచ్చిన జంతువు కుడి తొడను ఇస్తారు. జంతువు తొడతో కూర వండి సహపంక్తి భోజనాలు చేస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న ఆచారమని గిరిజనులు చెబుతున్నారు. ఉగాది ఉత్సవాలను దాసియ్యపాలెం, సీతప్పగూడెం, ముప్పినవారిగూడెం, మంచులవారిగూడెం గ్రామాల్లో వైభవంగా చేస్తారు. గంగానమ్మ, గుబ్బల మంగమ్మ, ముత్యాలమ్మ, నాగులమ్మ, కనకదుర్గమ్మ, పోచమ్మతల్లి, సమ్మక్క సారక్క, సూదికొండ మావుళ్ళమ్మ అమ్మవార్లకు ఘనంగా పూజలు చేసి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. గిరిజన ప్రాంతంలో కొంతమంది పంచాంగ శ్రవణం ద్వారా భవిష్యత్‌ను తెలుసుకుంటే మరికొంత మంది పూనకాల్లో వచ్చిన దేవతల ద్వారా వారి భవిష్యత్‌ను తెలుసుకోవడం విశేషం. గ్రామంలోని పాడిపంటలు, సుఖసంతోషాల గురించి, భవిష్యత్ గురించి పూనకాల నుంచి వచ్చిన దేవతల ద్వారా తెలుసుకుంటూ ఉంటారు. పూనకాల సమయంలో డప్పు వాయిద్యాలతో గ్రామాలు దద్దరిల్లిపోతాయి. మహిళా భక్తులు అత్యధికంగా పాల్గొని అమ్మవార్లను పూజిస్తూ ఉంటారు. ఉగాదిని పురస్కరించుకుని మన్య ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



వనదేవత వద్ద పూజలు చేస్తున్న గిరిజన మహిళలు(ఫైల్)



నృత్యాలు చేస్తున్న గిరిజనులు

గోదావరి నదిపై అక్రమ రవాణా

- వింజరం రేవు నుంచి గంజాయి తరలింపు
- ఇటీవల కేసు నమోదు చేసిన తెలంగాణ పోలీసులు

కుక్కునూరు: గోదావరి నది స్మగ్లింగ్‌కు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేవులపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అక్రమార్కులు స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. మండలంలోని వింజరం రేవు నుంచి తరలించిన 120 కేజీల గంజాయి బూర్గంపాడు వద్ద పట్టుబడడం, వందకు పైగా మూగజీవాలను వింజరం రేవు నుంచి తరలిస్తుంటే స్థానికులు పట్టుకోవడం వంటివి సంచలనం రేపాయి. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రవహిస్తున్న గోదావరి నదికి అవతల పక్కన భద్రాచలం , అల్లూరి సీతారామరాజు జిల్లాలు, వాటికి సమీపంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలున్నాయి. దీంతో గంజాయి, పశువులను ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో కొనుగోలు చేస్తున్న స్మగ్లర్లు వాటిని గుట్టుచప్పుడు కాకుండా గోదావరి దాటించి మండలం మీదుగా రోడ్డు మార్గంలో తరలిస్తున్నారు.

అనుమతించిన రేవుల్లోనే ప్రయాణించాలి

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలు పలు పనుల నిమిత్తం గోదావరి మీదుగా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. గోదావరి దాటాలంటే ప్రభుత్వం అనుమతించిన రేవుల గుండా వెళ్లాలి. పడవల మీదుగా గోదావరి దాటించేందుకు అధికారికంగా వేలేరుపాడు మండలంలోని రుద్రమకోట రేవుకు మాత్రమే అధికారులు వేలం పాట నిర్వహించి అనమతులు జారీచేశారు. కొంతమంది చేపలు పట్టేవారు ఆ సాకుతో పడవలలో ప్రజలను నిబంధనలకు విరుద్ధంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అనమతులు లేకుండా ప్రజల తరలింపును అధికారులు పట్టించుకోకపోవడంతో పనిలో పనిగా కొంత మంది అక్రమ మార్గంలో ఆదాయం కోసం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. ఇటీవల బూర్గంపాడు గంజాయి కేసులో మండలంలోని వింజరం రేవులో చేపలు పట్టే వ్యక్తిపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు వ్యక్తి గంజాయి స్మగ్లింగ్ ముఠాతో చేతులు కలిపి గంజాయిని పడవలపై తరలించినట్టు తెలుస్తుంది.



వింజరం రేవులో పడవలపై ప్రజలను దాటిస్తున్న దృశ్యం

పడవలను అడ్డుకుంటాం



వింజరం రేవులో అక్రమంగా ప్రజలను పడవల్లో తరలించే విషయం నా దృష్టికి వచ్చింది. అలా దాటించే పడవలను సీజ్ చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

కె తాతారావు, సెక్రటరీ, వింజరం పంచాయతీ

చేపలు పట్టేందుకు అనుమతి అవసరం



గోదావరి నదిలో చేపలు పట్టే వారికి మత్స్యశాఖ నుంచి అనుమతి ఉండాలి. అనుమతి లేకుండా నదిలో చేపలు పట్టడం చట్టవిరుద్ధం. అనుమతులు ఉన్న వారు ఏదైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్టు తెలిస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

కె మంగారావు, ఎఫ్‌డీఓ, ఐటీడీఏ కేఆర్ పురం

కాలువలో మునిగి ఇద్దరు మృతి

జంగారెడ్డిగూడెం: మండలంలోని కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం కుడి కాలువలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై శశాంక్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఆర్.వంశీకృష్ణ (23), కె.బాలసుబ్రహ్మణ్యం(30) వరుసకు బావ బావమరిదిలు. వీరు శనివారం మధ్యాహ్నం ఎర్రకాలువ జలాశయానికి వెళ్లారు. అక్కడ కొద్ది సేపు సేదతీరిన తరువాత స్నానం చేయడానికి జలాశయం కుడి కాలువ వద్దకు వెళ్లారు. స్నానానికి దిగిన ప్రాంతం లోతుగా ఉండటంతో మునిగిపోయారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే మునిగిపోవడంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న లక్కవరం ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. విషయం తెలిసిన మృతుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల తల్లిదండ్రుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించింది.



ఆర్.వంశీకృష్ణ



కె.బాలసుబ్రహ్మణ్యం

అత్యాచారం చేసి బెదిరిస్తున్నాడని ఫిర్యాదు

భీమవరం : ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి అత్యాచారానికి పాల్పడి.. ఫొటోలు తీసి బెదిరిస్తున్నాడంటూ ఓ అవివాహిత ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒకటో పట్టణ పరిధి తాడేరు రోడ్డుకు చెందిన బాధితురాలి ఇంట్లోకి అదే ప్రాంతంలో ఉండే ఎ.అరుణ్‌కుమార్ ఈ నెల 20న అక్రమంగా ప్రవేశించాడు. అతని భార్యపై గతంలో పెట్టిన కేసును వాపసు తీసుకోవాలని బెదిరించాడు. తర్వాత నోరు నొక్కి అత్యాచారం పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే వీడియోలను అందరికీ పంపిస్తానని, చంపుతానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సీఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వేల్పూరులో మద్యం దుకాణం వెనుక మృతదేహం గుర్తింపు

తణుకు అర్బన్: తణుకు మండలం వేల్పూరు గ్రామంలో మద్యం దుకాణం వద్ద శనివారం సాయంత్రం వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శ్మశాన వాటిక రోడ్డులోని సూర్య వైన్స్ వెనుక శనివారం సాయంత్రం గాయాలతో పడి ఉన్న వ్యక్తిని స్థానికులు గమనించారు. అతన్ని వేల్పూరు సంత మార్కెట్ ప్రాంతానికి చెందిన కుడుపూడి శ్రీనివాసరావు (55)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన వచ్చిన మృతుడి తల్లి, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఆటోలో ఎక్కించుకుని ఇంటికి తీసుకువెళ్లారు. అనంతరం తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం అందజేశారు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు గాయాలతో పడి ఉన్న తీరు పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. ముఖం, శరీరంపైనా గాయాలు ఉండడంతో ఎవరైనా కొట్టారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడితోపాటు మద్యం సేవించిన వారి వివరాలు సేకరిస్తున్నారు.



వేల్పూరులో మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

హత్య కేసులో నిందితుడి అరెస్టు?

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ సత్యనారాయణ పేట ప్రాంతంలో గురువారం అర్థరాత్రి వృద్ధురాలు చానాపతి రమణమ్మ (65) హత్య ఘటన ఏలూరులో సంచలనంగా మారింది. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీస్ అధికారులు హత్య కేసు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం రాత్రికే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ హత్యను సత్యనారాయణ పేటకు చెందిన ఒక యువకుడు చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పర్యవేక్షణలో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ దర్యాప్తు వేగవంతం చేశారు. హత్యకు కేవలం చిట్టీ పాటల డబ్బులే కారణమా ? ఇంకా వేరే కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా ఎవరైనా అతనికి సహకరించారా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

ఏలూరు టౌన్: తల్లిదండ్రులు మందలించారనే కోపంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి వచ్చి ఏలూరు ఆర్‌టీసీ బస్టాండ్‌లో కూర్చున్న బాలికను ఆటోడ్రైవర్ ఇంటి వద్ద దించుతానని నమ్మించి ఆటో ఎక్కించుకున్నాడు. పోణంగి రోడ్డులోని తన ఇంటికి తీసుకువెళ్ళి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో భయంతో బాలిక అతడి నుంచి తప్పించుకుని బయటకు వచ్చి కేకలు వేసింది. ఆ ప్రాంతంలోని హిజ్రాలు విషయాన్ని గమనించి బాలికను రక్షించి ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. శనివారం బాలిక తల్లిదండ్రులు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు ఆటోడ్రైవర్ ఆర్.ప్రభాకరరాజుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత మృతికి కారణమైన యువకుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: వివాహిత మృతికి కారణమైన యువకుడిని జంగారెడ్డిగూడెం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్సై షేక్ జబీర్ వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం మండలం యర్రంపేటకు చెందిన హేమదుర్గ అనంత ప్రసన్న అనే వివాహితను ప్రేమిస్తున్నానంటూ వెంటపడి ఆమె మృతికి కారణమైన మోదుగ పెద్దసాయిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి : నాటు సారా తయారీ కేంద్రాలపై దాడి చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. మండలంలోని చీపురుగూడెంలో జరిపిన దాడుల్లో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి భూక్యా మహేంద్రపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దాన ధర్మాలకు ప్రతీక రంజాన్

- 31న రంజాన్ పర్వదినం...
- తణుకు నియోజకవర్గంలో మసీదుల్లో నిత్య నమాజులు

తణుకు అర్బన్: స్నేహం, అభిమానానికి ప్రతీకగా భావించే రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలంతా మసీదుల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన మాసం సందర్భంగా మార్చినెలను ముస్లింలంతా రంజాన్ మాసంగా పరిగణించి కఠిక ఉపవాసాలు ఆచరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో తోటివారికి సాయపడుతూ దానధర్మాలు చేస్తూ త్యాగనిరతిని కొనసాగిస్తూ క్రమశిక్షణ, ధార్మిక చింతనతో మెలుగుతారు. ఈనెల 2 నుంచి ప్రారంభమైన రంజాన్ మాసం పురస్కరించుకుని తణుకు నియోజకవర్గంలోని మసీదుల్లోను, గృహాల్లోను ముస్లింలంతా ప్రత్యేకంగా నమాజులు చేస్తూ అల్లాహ్‌ను కొలుస్తున్నారు. ఈనెల 31వ తేదీన రంజాన్ పర్వదినాన్ని నిర్వహించుకుంటున్నారు.


అత్తిలిలో విద్యుత్ వెలుగుల్లో మసీదు

నిష్ఠగా ఉపవాసాలు

ఈనెల 31వ తేదీన రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు నిష్ఠతో కఠిక ఉపవాసాలు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామునే తేలికపాటి ఆహారం తీసుకుని తిరిగి రాత్రి వరకు సుమారు 13 గంటలపాటు ఉపవాసంగా నిలబడి మళ్లీ రాత్రి స్వల్ప ఆహారం తీసుకుంటారు. ఈ రంజాన్ మాసంలో ఎంతో కఠినంగా ఉపవాసాలు చేసి దాతృత్వంతో ఉంటే ఏళ్ల తరబడి ప్రార్థనలు చేస్తే వచ్చే పుణ్యం ఈ మాసంలో దక్కుతుందనేది వారి విశ్వాసం. ఈ మాసంలో ముస్లింలు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని పేదలకు అందజేస్తూ పేద, ధనిక తావులేకుండా చేస్తారని మసీదు గురువులు చెబుతున్నారు.

దివ్య ఖురాన్ అవతరించిన మాసం



దివ్య ఖురాన్ అవతరించిన రంజాన్ మాసాన్ని ముస్లింలంతా ఎంతో భక్తిగా జరుపుతాము. ఈమాస మంతా ఎంతో నియయ నిష్ఠలతో ఉపావాస దీక్షలు చేస్తూ ఖురాన్ పఠనంతోపాటు, జకాత్ రూపంలో పేదలకు దానధర్మాలు చేస్తాం.

– మెహర్ అన్సారీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, తణుకు

ముస్లిం సోదరులకు ప్రత్యేక పండుగ



ముస్లిం సోదరులందరికీ రంజాన్ ప్రత్యేక పండుగ. ముఖ్యంగా ఈ మాసమంతా కఠినంగా ఉపవాసాలు చేస్తూ అల్లాహ్‌ను కొలుస్తాం. ఉపవాసం మనిషిలో దైవభీతిని కలుగచేయడమే కాకుండా కోరికలకు కళ్లెం వేసి మనసును నియంత్రిస్తుంది.

– ఎండీ హబీబుద్దీన్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు, అత్తిలి

దాన గుణానికి ప్రతీకగా రంజాన్ మాసం



ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో నియమ నిష్ఠలతో ప్రార్థనలు చేస్తాం. అంతేకాకుండా తమ సంపాదనలో వారి స్తోమతను బట్టి కొంత ధనాన్ని పేదలకు సాయంగా అందిస్తుంటారు. దానగుణానికి ప్రతీకగా ముస్లింలంతా రంజాన్ మాసాన్ని ఆచరిస్తుంటారు.

– షేక్ బాజీ, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు

క్లుప్తంగా

బలుసులమ్మకు విశేష పూజలు


విశేష అలంకరణలో బలుసులమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది పురస్కరించుకొని పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయంవద్ద శనివారం వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి విశేష పుష్పార్చన జరిగింది. మహిళలచే సామూహిక లలితా పారాయణం గావించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శుభ్రతతోనే ఆరోగ్యం


నవాబుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి నిర్వీర్యం చేయడం ద్వారా ప్రాణాంతక జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. శనివారం మండలంలోని జగన్నాథపురం, నవాబుపాలెం గ్రామాల్లో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్, హైజీన్, ఫ్రైడే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు లక్ష్మి, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కనకదుర్గ, ఆశాలు సుమ, రాధ, లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పి.సత్యవాణి, ఆరోగ్య సహాయకులు లక్ష్మణరావు, కాంతారావు, హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో మెడికల్ క్యాంపు


పడాల సచ్చిదానంద వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పడాల సచ్చిదానంద వృద్ధాశ్రమంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కార్తీక లక్ష్మి, ఆస్మిన మీరజ్, కాంతి భూపతి, నిర్మల జ్యోతి, రవి 52మంది వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్‌సీహెచ్. ధనలక్ష్మి, జిల్లా ఎపిడెమియాలోజిస్ట్ సుభాష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు కామిశెట్టి శ్రీనివాస్, కామిశెట్టి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం నినాదాన్ని పాటించాలి

తణుకు అర్బన్: ఆరోగ్యమే మహా భాగ్యం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని పెరవలి రోడ్డులో గ్రౌండ్ లెవెల్ మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్, వెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీ యాక్టివిటీస్‌ను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ఖర్చురహిత వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత విధిగా పాటించాలన్నారు. మురుగునీటిపై మడ్ ఆయిల్ చల్లుకోవాలని తద్వారా లార్వా దశలోనే దోమ పుట్టుకకు బ్రేక్ పడుతుందని, ఎండిన వేపాకుల పొగ కూడా సహజ ఫాగింగ్‌లా ఉపకరిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీ పి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

గూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శిరిగినీడి


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శిరిగినీడి విజయ కృష్ణను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తోట మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పెదగాడి హెచ్ వీఎస్ఎస్ భూపాల్, కోశాధికారిగా ఈడా ఫరోత్ బాబు, జాయింట్ సెక్రటరీగా కె.మణిరాజు, స్పోర్ట్స్ సెక్రటరీగా పమ్మి వీరభద్రుడు, లైబ్రేరియన్ సెక్రటరీగా సిరవరపు శివకుమార్, లేడీ రిప్రజెంటేటివ్ ఎం.సత్యవేణి, మరో 7 గురు సభ్యులు బి.శ్రీనివాస్, జీవీ రవికుమార్, జీవీవీఎస్ఎన్‌మూర్తి, హరిదాసుల రవీంద్ర కుమార్, కె.మణికంఠ, ఎం.రామచంద్రరావు, టి.పెద వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. శిరిగినీడి విజయకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్‌కు మంచి పేరు వచ్చే విధంగా కార్యవర్గం పనిచేస్తుందన్నారు. అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు ప్రతి న్యాయవాదికి కృతజ్ఞతలు చెప్పారు.

ఇళ్లస్థలాలకై ధర్నా


తహసీల్దార్ సునీల్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. గృహ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. వీటి సాధనకై ఏప్రియల్ 2వ తేదిన కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపడతామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే ఇళ్ల స్థలాల సాధన సమితీ ఏర్పాటు చేసి, పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పేదలు అద్దెలు కట్టుకోలేకపోతున్నారని, వారికి సత్వరమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సునీల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు వడ్డాది మేరీ, కార్యదర్శి నాగరాజు, నాగలక్ష్మి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సుందర్, సనపల శ్రీనివాసరావు, ఎంఎం.జోషి, ఇళ్లస్థల అర్జీదారులు పాల్గొన్నారు.





భారాలు మోపే విధానాలు వద్దు


జగన్నాథపురం సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


దువ్వ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలపై భారాలు మోపే ప్రభుత్వ విధానాలు ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం మండలంలోని జగన్నాథపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలపై విపరీతమైన విద్యుత్ భారాలు మోపేందుకు సిద్ధమవుతుందన్నారు. టైమ్ ఆఫ్ విధానాన్ని రద్దు చేయాలని, రైతులు బోర్లకు మీటర్లు బిగించే ఆలోచన వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ విధానాలతో ప్రభుత్వం ముందుకెళ్తే ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి కండెల్లి విజయ, పీలా గాదినాయుడు, కండెల్లి రమేష్‌బాబు, జి. వెంకటేశ్వరరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై కూటమి హామీ నిలబెట్టుకోవాలి

తణుకు అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని వీలైతే తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం నాయకులు బళ్ళ చిన వీరభద్రరావు అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తణుకు మండలం దువ్వ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో తీసుకువచ్చిన నూతన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో జరిగిన పోరాటంలో ముగ్గురి ప్రాణాలు బలిగొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ పోరాటం ఫలితంగానే ఆనాడు సంస్కరణలు వేగం తగ్గడమే కాకుండా రెండు దశాబ్దాల పాటు చార్జీలు పెంపుపకు ఏ ప్రభుత్వం సాహసం చేయలేకపోయాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్తు బారాలు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. దొంగల నాగేశ్వరరావు, బందారు వెంకటేశ్వరరావు, తూము శ్రీను, నీలం వెంకట బసవయ్య, మేకా వీరబాబు, ఎస్.స్వామి, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

దానేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు


దానేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం సత్యవతి నగర్‌లో దానేశ్వరి అమ్మవారిని శనివారం రాత్రి మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఏడాది ఉగాది పండుగు ముందురోజు దానేశ్వరి అమ్మవారు జాతర నిర్వహించడం పట్టణ ప్రజల భాగ్యమన్నారు. ఉగాది పండుగు ముందురోజు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం తనకు అదృష్టమన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐశ్వర్యదుర్గ అమ్మవారికి అభిషేకాలు

అత్తిలి: స్థానిక రామన్నపేట లో ఐశ్వర్యదుర్గ అమ్మవారికి శనివారం పండ్లరసాలతో అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. ఈసందర్భంగా అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు రమేష్ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. అమావాస్య, షష్టగ్రహ కూటమి సందర్భంగా లోక కల్యాణార్థం అమ్మ వారికి అభిషేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దాసరి నాగరాజు పాల్గొన్నారు.

31న క్రైస్తవ జేఏసీ ర్యాలీ

పెంటపాడు: దైవసేవకులు ప్రవీణ్ పగడాల మృతి మిస్టరీపై న్యాయ విచారణ కోరుతూ గూడెం క్రైస్తవ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గూడెం పట్టణంలో ర్యాలీ చేయనున్నట్లు జేఏసీ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా గూడెం హౌసింగ్ బోర్డు నుంచి బస్టాండ్‌సెంటర్, తాలూకా కార్యాలయం వరకు ఈ ర్యాలీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డినామినేషన్‌తో సంబంధం లేకుండా ప్రతీ క్రైస్తవ సంఘం, విశ్వాసులు తప్పక పాల్గొనాలని కోరారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం గ్రామంలో శనివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



విజిలెన్స్ దాడులు


పట్టణంలోని దీప్తి రెక్సిన్‌లో సోదాలు చేస్తున్న విజిలెన్సు అధికారులు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని వివిధ దుకాణాలలో శనివారం విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంటు, తూనికల కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ఫర్నీచర్ దుకాణాలు, కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. దీప్తి రెక్సిన్ దుకాణంలో సోదా చేయగా తయారీతేదీ, తయారుదారీ చిరునామా , గరిష్ఠ చిల్లర ధర, వినియోగదారు సేవా ఫోన్ నంబరు వంటి సమాచారం లేకుండా దిండ్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. హారిక ట్రేడింగ్ కంపెనీలో ఇలాంటి సమాచారం లేకుండా విక్రయిస్తున్న జీడిపప్పును గుర్తించారు. దుర్గ జనరల్ స్టోర్స్‌లో ఎలాంటి సమాచారం లేకుండా విక్రయిస్తున్న శనగలు ప్యాకెట్లను గుర్తించారు. ఈ మేరకు మూడు దుకాణాలపై తూనికలు, కొలతలు చట్ట ప్రకారం మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. రీజినల్ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు అధికారి వి.శ్రీరాంబాబు ఆదేశాల మేరకు జరిపిన సోదాల్లో విజిలెన్సు ఎస్ఐ కె.సీతారాము, తూనికల కొలతల అధికారి డి.రాంబాబులు పాల్గొన్నారు.



పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలో పదో తరగతి ఒకేషనల్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెం టౌన్, రూరల్, పెంటపాడులలో పరీక్ష జరిగింది. పరీక్షకు హాజరుకావాల్సిన వారు మొత్తం విద్యార్థినీ, విద్యార్థులు 280 మంది కాగా 264మంది హాజరయ్యారు. 16మంది హాజరు కాలేదు. స్క్వాడ్ అధికారులు ఆయా కేంద్రాలను తనిఖీలు చేశారు. ఇది ఇలా ఉంటే ఈ నెల 31వ తేదీన జరగాల్సిన సోషల్ పరీక్ష రంజాన్ కారణంగా ఏప్రిల్ 1వ తేదీన మంగళవారంనకు మార్చారు.

విద్యార్థులకు మలబార్ స్కాలర్‌షిప్‌లు

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయెంకా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు మలబార్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ కేసీహెచ్ చంద్రశేఖర్‌బాబు తెలిపారు. కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన సుమారు 8 మందికి మలబార్ గోల్డ్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.8వేల చెక్కును భీమవరంలో మలబార్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు చేతుల మీదుగా అందజేశారు. కాగా ఎంపికైన ఈ విద్యార్థులను శనివారం కళాశాలలో ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎంపిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో జరిగింది. గౌరవాధ్యక్షుడిగా మరడాని రాము, గిరి, ప్రెసిడెంట్‌గా కాపకా గంగాధర్, ఉపాధ్యక్షుడిగా పెద్దోజు మురళీ, మానేపల్లి భానుప్రసాద్, జనరల్ సెక్రటరీగా అయితం ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా మారంపల్లి రామకృష్ణ, యాదగిరి, మీరా, ముని, భరత్, కోశాధికారిగా పవన్, ఉప కోశాధికారిగా జానకిరామయ్యలు, సభ్యులుగా మరో 12 మందిని ఎంపిక చేశారు. నూతన కార్యవర్గంను పలువురు అభినందించారు.





